నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చందానగర్‌ : మదీనాగూడ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌ రెడ్డి పేర్కొన్నారు.

- సీబీఆర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అర్జున్‌రెడ్డి కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్‌, ఫ్రెండ్స్‌ కాలనీ, వెస్ట్‌మెట్రో అపార్ట్‌మెంట్స్‌ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

ఆల్విన్‌ కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కెవి ఆర్‌పి కాలనీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఆర్‌పి కాలనీ, దీనబంధు కాలనీ, రామకృష్ణనగర్‌, హనుమాన్‌నగర్‌, ప్రగతినగర్‌లలో..

- 11 కెవి చిత్తారమ్మ ఆలయం ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సప్తగిరి కాలనీ, భాష్యం స్కూలు ప్రాంతం, 11 కెవి. అరుణ సొసైటీ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్‌: గౌతమీనగర్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 4.30 గంటల వరకు లేక్‌ వ్యూ కాలనీ, శుభోదయ కాలనీ, గౌతమినగర్‌, వర్టెక్స్‌ శ్రీనివాసనగర్‌, నిజాంపేట్‌ మెయిన్‌ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేత



ఆయా కుటుంబాలకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: నిరుపేద రోగులను సీఎంఆర్‌ఎఫ్‌ ఆదుకుంటోందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 60 మంది లబ్ధిదారులకు రూ.24.60 లక్షల చెక్కులను ఆయన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, అక్తర్‌, శ్రీనివాస్‌, రాజేందర్‌, కాశీనాథ్‌యాదవ్‌, ఇబ్రహీమ్‌, ఆష్రాఫ్‌, అనిల్‌, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

సైబరాబాద్‌ సీపీ అవినాష్‌మహంతి



సైబరాబాద్‌ కమిషనరేట్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ అవినాష్‌ మహంతి

రాయదుర్గం: కేన్సర్‌ అనేది తీవ్ర ఆరోగ్య సమస్య అని సైబరాబాద్‌ కమిషనర్‌, ఎస్‌సీఎస్‌సీ చైర్మన్‌ అవినాష్‌ మహంతి పేర్కొన్నారు. గురువారం సైబరాబాద్‌ కమిషనరేట్‌లో సొసైటీ ఫర్‌ సైబరాబాద్‌ సెక్యూరిటీ కౌన్సిల్‌(ఎస్‌సీఎస్‌సీ), గ్రేస్‌ క్యాన్సర్‌ ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్‌, ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ బస్‌ ద్వారా గ్రేస్‌ క్యాన్సర్‌ ఫౌండేసన్‌ గ్లోబల్‌ సీఈఓ డాక్టర్‌ సుంకవల్లి చినబాబు, డాక్టర్‌ ప్రమీలారాణి, వైద్య బృందం సంయుక్త ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సైబరాబాద్‌ సీపీ అవినాష్‌ మహంతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే సకాలంలో చికిత్స తీసుకుని తగ్గించుకోవచ్చన్నారు.పోలీసులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రేస్‌ కేన్సర్‌ ఫౌండేషన్‌ గ్లోబల్‌ సీఈఓ డాక్టర్‌ చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ ప్రతి యేటా భారతదేశంలో రెండు మిలియన్‌ కేన్సర్‌ కేసులు నమోదు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలోసైబరాబాద్‌ జాయింట్‌ కమిషనర్‌ డి జోయల్‌ డేవిస్‌, ఎస్‌సీఎస్‌సీ సెక్రెటరీ జనరల్‌ రమేష్‌ కాజా, ఏడీసీపీలు రవిచందన్‌ రెడ్డి, షమీర్‌, ఏసీపీ గంగారామ్‌, ఎస్‌సీఎస్‌సీ అసోసియేట్‌ డైరెక్టర్‌ రాజేంద్రప్రసాద్‌, హెల్త్‌ ప్రొగ్రామ్‌ మేనేజర్‌ ప్రవీణ్‌ ఉమ్మాడి,ఎస్‌సీఎస్‌సీ విమెన్స్‌ ఫోరమ్‌ మెంబర్‌ రిలేషన్స్‌ మేనేజర్‌ లలిత, సీటీసీ డాక్టర్‌ డాక్టర్‌ సరిత, ఫౌండేషన్‌ సలహాదారు గారపాటిప్రసాద్‌, వ్యవస్థాపక ట్రస్టీ డాక్టర్‌ ప్రమీలా రాణి, సైకియాట్రిస్ట్‌ డాక్టర్‌ దీప్తి,డాక్టర్‌ సురి, 35 మంది వైద్య బృందం, బీఎస్‌ రాజేష్‌ పాల్గొన్నారు.

స్వదేశీ హస్తకళల ఎగ్జిబిషన్‌ ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: స్వదేశీ హస్తకళల ఎగ్జిబిషన్‌ వినియోగదారులను ఆకట్టుకుంటున్నది. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని తులసినగర్‌లో స్వదేశీ సేల్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వదేశీ హస్తకళల ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో వన్‌గ్రామ్‌ గోల్డ్‌ ఆభరణాలు, జమ్మూ కశ్మీర్‌ ఎంబ్రాయిడరీ, ధర్మవరం, వెంకటగిరి, గద్వాల, పోచంపల్లి పట్టు చీరలు, కలంకారి వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, కుండలు, హర్యానా బెడ్‌షీట్‌లు , పెయింటింగ్‌ హ్యాండీ క్రాఫ్ట్‌లను డిస్కౌంట్‌ సేల్స్‌తో అందిస్తున్నామని నిర్వాహకులు ప్రదీప్‌ తెలిపారు. తినుబండారాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరిసర ప్రాంతవాసులు స్వదేశీ హస్తకళల ఉత్పత్తులు కొనుగోలు చేసి చేతి వృత్తి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

బాలుడు అదృశ్యం



ఐనేష్‌ (ఫైల్‌)

చందానగర్‌ : బాలుడు అదృశ్యమైన సంఘటన చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన ప్రకారం.. శేరిలింగంపల్లి నల్లగండ్ల అపర్ణ సైబర్‌ కమ్యూనిటీలో నివాసముండే శివకుమార్‌ కాలకోటికి ఒక కుమార్తె, కుమారుడు ఐనేష్‌ ఉన్నారు. ఐనేష్‌ (16) ఇంటర్‌ చదువుతున్నాడు. బుధవారం రాత్రి భోజనం చేసి తన గదికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం తల్లిదండ్రులు బాలుడి గదికి వెళ్లి చూడగా కనపడలేదు. పరిసరాల్లో వెదికినా ఫలితం లేకపోవడంతో అపార్ట్‌మెంట్‌ సీసీ కెమెరాలను పరిశీలించగా బుధవారం రాత్రి 11.30 గంటలకు బయటకు వెళ్లినట్టు కనపడింది. తల్లిదండ్రులు బాలుడి గదిలోకి వెళ్ళి ల్యాప్‌టాప్‌ చూడగా నేను వెళ్లిపోతున్నాను.. నాకోసం వెదకవద్దు అనే మెసేజ్‌ను గమనించారు. వెంటనే చందానగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కూరగాయల ధరలు


శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 40, పచ్చిమిర్చి 40, బెండ 60, కాకర 60, దొండ 40, దోస 60, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 60..





చేతితో చెక్కారు

శిల్పారామంలో ఆకట్టుకుంటున్న యూపీ హస్తకళాకారుల ఉత్పత్తులు



మాదాపూర్‌: శిల్పారామంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గృహాలంకరణ కోసం ఫ్లవర్‌ పాట్‌లు, కుర్చీలు, గ్లాసులు, ఏనుగు బొమ్మలు, యుద్ధ ట్యాంకులు, మోటార్‌ సైకిళ్లను చెక్క, ఇత్తడితో అద్భుతంగా తయారు చేశారు. వీటి విలువ రూ.100 నుంచి లక్ష రూపాయల దాకా పలుకుతోంది. చెక్క మెకానికల్‌ వాచ్‌లు, అద్దాలు, ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నా రు. కావల్సిన డిజైన్లను ఆర్డర్‌ ద్వారా తయారు చేసి ఇస్తామన్నారు.

చేతితో చేసిన వాటికి ధర కాస్త ఎక్కువే..

చేతితో తయారు చేసిన వస్తువులు ఎక్కువ కాలం మన్నుతాయి. కళాకారులు తయారు చేసే ఉత్పత్తులను డైరెక్ట్‌గా అమ్మకాలు జరుపుతున్నాము. ఆర్డర్‌పై కావలిసిన వాటిని తయారు చేసి ఇస్తాము. వివిధ రకాల చెక్క వస్తువులు అందుబాటులో ఉన్నాయి. ఫోన్‌. 7417602018.

– అద్నాన్‌, స్టాల్‌ నిర్వాహకుడు










శేరిలింగంపల్లిలో మరో ఎక్సైజ్‌ స్టేషన్‌



శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్‌ అండ్‌ ప్రొహిబిషన్‌ స్టేషన్‌

చందానగర్‌: ఇటీవల రాష్ట్రంలో కొత్తగా ఎక్సైజ్‌ స్టేషన్ల ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శేరిలింగంపల్లి మండలంలో మరొక ఎక్సైజ్‌ స్టేషన్‌ రానుందని మండల ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మణ్‌గౌడ్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండలం పరిధి ఎక్కువగా ఉన్నందున స్టేషన్‌ను కుదించి నూతనంగా కొండాపూర్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. డివిజన్ల వారీగా విభజించనున్నారని కొండాపూర్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌లోకి మాదాపూర్‌, కొండాపూర్‌ డివిజన్లు, శేరిలింగంపల్లి ఎక్సైజ్‌ స్టేషన్‌లోకి గచ్చిబౌలి, చందానగర్‌, మియాపూర్‌, శేరిలింగంపల్లి డివిజన్లు వస్తాయన్నారు. ఇప్పటికి వరకు మండలంలో 39 వైన్‌ షాపులు, 134 బార్‌లు ఉన్నాయన్నారు. ఇందులో ఎన్ని వైన్‌ షాపులు, బార్‌లు మరో ఎక్సైజ్‌ స్టేషన్‌కు వెళ్తాయో గెజిట్‌ విడుదల చేస్తే తెలుస్తుందన్నారు.

రామచంద్రాపురం పీఎస్‌ను సందర్శించిన డీసీపీ



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ వినీత్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం మాదాపూర్‌ డీసీపీ డా. వినీత్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పలు విషయాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మియాపూర్‌ ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్‌ జగన్నాథ్‌, ఎస్‌ఐ శశికాంత్‌రెడ్డి తదితరులున్నారు.

ఫుడ్‌ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని పలు రెస్టారెంట్లలో గురువారం ఫుడ్‌ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. అపరిశుభ్రంగా ఉన్న వాటికి నోటీసులు ఇచ్చారు. గురువారం మూసాపేట ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ పవన్‌ నేతృత్వంలో పలు హోటళ్లను తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా వంటగది, బొద్దింకలు కనిపించడంతో బాటు ఆహార పదార్థాలను కప్పి ఉంచకపోవటం, లేబుల్‌ చేయకపోవడంతో పాటు మెడికల్‌ ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌, పెస్ట్‌ కంట్రోల్‌ రికార్డులు లేవని తెలిపారు.

నల్లగండ్లలో ఘనంగా ఛట్‌ పూజ



నల్లగండ్ల చెరువు వద్ద నిర్వహించిన ఛట్‌ పూజ వేడుకల్లో భారీగా పాల్గొన్న ఉత్తర భారతీయులు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌ పరిధి నల్లగండ్లలో ఛట్‌ పూజ కార్యక్రమాన్ని గురువారం కనులపండువగా నిర్వహించారు. ఉత్తర భారతీయులు అత్యంత వైభవంగా నిర్వహించే వేడుకల్లో ఛట్‌ పూజ ప్రముఖమైంది. భూమి మీద మనుగడ సాగించేందుకు అవకాశం కల్పించిన సూర్యభగవానునికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయురారోగ్యాలను, ఆనందాన్ని ప్రసాదించాలని కోరుకుంటారు. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్‌ ఆరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో బిహార్‌, జార్ఖండ్‌, మధ్యప్రదేశ్‌, ఉత్తరప్రదేశ్‌, ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్‌, చండీఘడ్‌, గుజరాత్‌, రాంచీ, ముంబై తదితర ప్రాంతవాసులు భారీగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, రఘునాథ్‌ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్‌, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనీ లాండరింగ్‌ కేసు అంటూ సైబర్‌ మోసం

రూ.65 వేలు పోగొట్టుకున్న ఐటీ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్‌: మనీ లాండరింగ్‌ కేసులో నీ ఆధార్‌, ఫోన్‌ నంబర్‌ ఉన్నాయంటూ బెదిరించి డబ్బు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కధనం ప్రకారం...పటాన్‌చెరులోని ఓ కాలనీకి చెందిన ఐటీ ఉద్యోగికి నవంబర్‌ 4వ తేదీన మనీలాండరింగ్‌ కేసులో మీ ఆధార్‌, ఫోన్‌ నెంబర్‌ ఉన్నాయంటూ అపరిచిత వ్యక్తి భయపెట్టాడు. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా రూ.65 వేలు వేశాడు. అనంతరం తిరిగి మళ్లీ నగదు అడగడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌.. 10 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 10 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు, ఫుట్‌పాత్‌ ఆక్రమణల తొలగింపు

- హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలో వీధి వ్యాపారుల ధర్నా



నాలెడ్జి సిటీ రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న స్ట్రీట్‌ వెండర్స్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌ హోటల్‌ వద్ద ప్రధానరోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఫుడ్‌స్టాల్స్‌, టీస్టాల్స్‌, ఇతరత్రా వాటిని గురువారం తొలగించారు. టీఎస్‌ఐఐసీ, ఐలా అధికారులు ఎమర్జెన్సీ రెస్పాన్స్‌ టీమ్‌తో సైబరాబాద్‌ పోలీసుల ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తొలగించారు. దీంతో వీధి వ్యాపారులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అనంతరం రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే తమ జీవనాధారమని ,ఆకస్మాత్తుగా తొలగించాలని ఆదేశించడం ఎంత వరకు న్యాయమని వాపోయారు. గతంలో కుమారి ఆంటీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆ ప్రాంతంలో ఫుడ్‌స్టాల్స్‌కు అనుమతి ఇచ్చి ప్రస్తుతం ఇక్కడ తొలగించాలని ఆదేశించడం ఏంటని వాపోయారు. వ్యాపారం చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : జీహెచ్‌ఎంసీ డివిజన్‌ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురం డివిజన్‌ పరిధిలోని మయూరినగర్‌, శ్రీ సాయినగర్‌ కాలనీలలో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రాపురం, భారతీనగర్‌, పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని అన్ని కాలనీలలో ప్రణాళికబద్ధంగా నిధులను కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా మూడు డివిజన్ల పరిధిలో కోట్లాది రూపాయలతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ పుష్ప నగేష్‌, స్థానిక నేతలు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం వల్ల డాక్టర్లపై నమ్మకం పోతుంది

- డాక్టర్‌ శరత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ శరత్‌రెడ్డి , వైద్యులు

మాదాపూర్‌: వైద్యంలో నమ్మకమే ముఖ్యమని, డాక్టర్లపై నమ్మకం ఉంటేనే రోగిని బాగు చేయగలమని డాక్టర్‌ శరత్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని ఆస్పత్రిలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కొందరి వల్ల వైద్యులపై నమ్మకం పోతుందన్నారు. ప్రతి పేషెంట్‌ను బతికించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని, అందులో భాగంగానే నాగప్రియను జాయిన్‌ చేసుకున్నామన్నారు. ఆమెకు ప్లాస్మా చేంజ్‌ చేయాల్సి ఉందని, మల్టీపుల్‌ ఆర్గాన్స్‌ ఫెయిల్‌ అయ్యాయని కుటుంబసభ్యులకు చెప్పామన్నారు. తాము డబ్బు కోసం ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్‌ సతీష్‌ కైలాసం, డాక్టర్‌ లక్ష్మీకాంత్‌రెడ్డి, డాక్టర్‌ ఉమాపతి, డాక్టర్‌ మిథిలేష్‌ పాల్గొన్నారు.

లింగంపల్లి రైల్వేస్టేషన్‌ నుంచి.. రైళ్ల వివరాలు

4.40	అమరావతి ఇంటర్‌ సిటీ ఎక్స్‌ప్రెస్‌	లింగంపల్లి– విజయవాడ
6.15	జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌	లింగంపల్లి– వైజాగ్‌
12.25	దేవగిరి ఎక్స్‌ప్రెస్‌	లింగంపల్లి–సీఎస్‌ఎంటీ (ముంబాయి)
17.30	నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌	లింగంపల్లి– తిరుపతి
18.30	కోకనాడ ఎక్స్‌ప్రెస్‌	లింగంపల్లి– కాకినాడ (సోమ, బుధ, శుక్ర) (19.00 మంగళ, గురు, శని)
20.30	గౌతమి ఎక్స్‌ప్రెస్‌	లింగంపల్లి– కాకినాడ
21.05	నర్సాపూర్‌ ఎక్స్‌ప్రెస్‌	లింగంపల్లి–నర్సాపూర్‌
21.40	హాంసఫర్‌ ఎక్స్‌ప్రెస్‌	లింగంపల్లి– ఇండోర్‌ (ఆదివారం)

సూర్య భగవానుడి ఆలయం నిర్మిస్తాం



ఛట్‌ పూజ ఉపవాస దీక్షలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ఛట్‌ పూజ ఉపవాస దీక్షలు ప్రారంభం, పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: పట్టణంలోని సాకి చెరువుకట్ట పైన 50 లక్షల రూపాయల సొంత నిధులతో సూర్య భగవాన్‌ దేవాలయం నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి తెలిపారు. ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్‌ పూజ సందర్భంగా గురువారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని సాకి చెరువు కట్టపైన ఏర్పాటు చేసిన ఉపవాస దీక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం ఉదయం 7:30 గంటలకు సూర్య భగవానుడి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌ కుమార్‌, పార్టీ సీనియర్‌ నాయకులు అఫ్జల్‌, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో ఫ్రీడం పార్కు ప్రారంభం

మూసాపేట: కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో ఫ్రీడం పార్కును గురువారం జీఈఎఫ్‌ ఇండియా గ్రూప్‌ ప్రెసిడెంట్‌ అక్షయ చౌదరి, జీఈఎఫ్‌ ఇండియా సేల్స్‌, మార్కెటింగ్‌ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. జెమినీ ఎడిబుల్‌ ఫ్యాట్స్‌ ఇండియా లిమిటెడ్‌ (ఫ్రీడం హెల్దీ వంట నూనెల తయారీదారులు) తమ కార్పొరేట్‌ సామాజిక బాధ్యతలో భాగంగా ఫ్రీడం పార్కును రెండున్నర ఎకరాల్లో రూ.2.76 కోట్ల వ్యయంతో పార్కును అభివృద్ధి చేశారు. జాగింగ్‌, వాకింగ్‌ ట్రాక్‌, యాంపి థియేటర్‌, కమ్యూనిటీ సమావేశాల కోసం కవర్‌జోన్‌, పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక ఆటస్థలం, బహిరంగ వ్యాయామశాల, యోగ, బెంచీలు, వాష్‌రూమ్‌లతో పాటు పార్కులో గ్రీనరీని అద్భుతంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



పార్కులో ఓపెన్‌ జిమ్‌